క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

శాయంపేట : మండలంలోని 23 గ్రామాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నేడు (ఆదివారం) ఉదయం నుంచి రాత్రి వరకు పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వ్యక్తి రిమాండ్

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ఇద్దరు రైతులు హద్దుల విషయంలో గొడవ పడడంతో సాక్షిగా ఉన్న వ్యక్తి కంక కర్రతో చితకబాదిన వ్యక్తిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. నేరేడుపల్లికి చెందిన ఇద్దరు రైతులు హద్దుల విషయంలో గొడవ పడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా అట్టి గొడవలో సాక్షిగా ఉన్న అదే గ్రామానికి చెందిన గజ్జెల లింగమూర్తిని కంక కర్రతో చితకబాదిన పల్లె కోటయ్యకు పరకాల కోర్టు రిమాండ్ విధించగా పరకాలలోని సబ్ జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. భూ వివాదాలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలి కాని దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

'భూ భారతి'ని పకడ్బందీగా అమలు చేయాలి

- భూ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రఘు



మాట్లాడుతున్న గడ్డం రఘు

కమలాపూర్: భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని భూ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రఘు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన కమలాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద రైతాంగానికి న్యాయబద్ధంగా ఇచ్చిన లావని, ఏక్ సాల్ పట్టాలను తక్షణమే పేదలకు పట్టాలు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పేద ప్రజల పక్షాన కోరారు. కార్యక్రమంలో భూ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలుగు రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు పెరిక శ్రీనివాస్, నాయకులు రాజేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



ఫ్లెక్సీ పట్టుకుని ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

కమలాపూర్: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలు ఉన్నారా, ఉంటే ఏ బడికి వెళ్తున్నారని, లేదంటే బడి మానేశారా అనే వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే ఉత్తమ బోధన

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



బడి బాట కార్యక్రమంలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం : ప్రభుత్వ స్కూళ్లలోనే ఉత్తమ బోధన అందుతోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆశాలపల్లిలో కాపుల కనపర్తి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు శనివారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలో నైతిక విలువలతో కూడిన విద్యాబోధన లభిస్తోందని చెప్పారు. అత్యున్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తున్నట్టు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లకు పంపించి ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, తదితర సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని చెప్పారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి పాల్గొన్నారు.

కార్యాలయాలకు స్థలాల కొరత

- మండల పరిషత్ కార్యాలయానికి నిధులు మంజూరు
- ఎస్సీ హాస్టల్‌లో తహసీల్దార్ ఆఫీస్, పోలీస్ స్టేషన్ నిర్వహణ
- ఎమ్మార్సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం
- సొంత భవనాలు లేక ప్రజలు, అధికారుల ఇబ్బందులు



ఎమ్మార్సీ భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం

వేలేరు : నూతనంగా ఏర్పడిన వేలేరు మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు స్థలాలు కొరతగా మారాయి. మండలం ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రభుత్వ సొంత కార్యాలయాలకు స్థలాలు లేవనే కారణంతో ఆఫీసుల ఏర్పాటుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సొంత భవనాలు లేకపోవడంతో అసౌకర్యాల మధ్య పాలన కొనసాగుతోంది. వేలేరు మండలంగా ఏర్పాటైన తర్వాత గతంలో మూతపడిన ఎస్సీ హాస్టల్‌లో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే ఎంపీడీఓ ఆఫీస్‌ను మొదట ఓ ప్రైవేట్ వ్యక్తి ఇంటిని అద్దెకు తీసుకుని ఏర్పాటు చేసినా అధికారులు ప్రభుత్వం సకాలంలో అద్దె చెల్లించకపోవడంతో ఆ వ్యక్తి కార్యాలయాన్ని తమ ఇంట్లో నుంచి తీసివేయాలని గొడవ చేశాడు. అధికారులు అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల ప్రాంగణంలోని ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేశారు.

ఎంపీడీఓ ఆఫీస్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు

మండల పరిషత్ కార్యాలయ నిర్మాణానికి కొన్ని నెలల క్రితం ప్రభుత్వం రూ.1 కోటి 50 లక్షలతో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అలాగే మూడు నెలల క్రితం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీడీఓ కార్యాలయం శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. పలు సందర్భాల్లో మండలానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి కార్యాలయం నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెబుతున్నా అది ఆచరణలోకి మాత్రం రావడం లేదు. అలాగే మండల వ్యవసాయాధికారి కార్యాలయం రైతు వేదికలో, ఎంఈఓ కార్యాలయం పాఠశాలలో కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నా అవి కొంతమంది కబ్జా చేశారని, కొన్ని చెరువు శిఖంలో ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించి భవనాల నిర్మాణాలను ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి



ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం కొన్ని నెలల క్రితం నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులు ప్రారంభిస్తారనుకుంటే ఇప్పటికీ అతీగతి లేదు. ఎమ్మెల్యే శ్రీహరి మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాలకు స్థలాలు గుర్తించి, కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించే విధంగా చొరవ తీసుకోవాలి.

– గొవింద సురేష్, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్

వందపడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

ఎల్కతుర్తి: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు సరిహద్దు ప్రాంతంగా ఉన్న ఎల్కతుర్తిలో వందపడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలన్నారు. రబీలో దేవాదుల నీరు వదిలినప్పటికీ కాల్వలకు గండ్లు పడి నీరు వృథాగా పోయిందన్నారు. దీంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరందని పరిస్థితి నెలకొందన్నారు. వరంగల్ ఎంజీఎం దూరంగా ఉండడం వల్ల ఎల్కతుర్తి మండలంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు ఎమర్జెన్సీ చికిత్స అందకపోవడంతో చాలా మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని వందపడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కగార్ పేరుతో మావోయిస్టులను ఏరివేస్తామని ఎన్‌కౌంటర్ల ద్వారా చంపడంతో మావోయిస్టులు శాంతి చర్చలు జరపాలని కోరగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ స్పందించలేదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉట్కూరి రాములు, కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, మండల కార్యదర్శి శనిగరం రాజ్‌కుమార్, రాజనర్సు, మొండయ్య, మల్లయ్య, చంద్రమౌళి, రామస్వామి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయాలి

- జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి



డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

ఎల్కతుర్తి : పోలీసులతో పాటు అన్ని వర్గాల ప్రజలు కలిసి డ్రగ్స్ మహమ్మారిని అంతం చేసి ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందించేందుకు కృషి చేయాలని జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర జేఏసీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర మండలంలో శనివారం మూడో రోజు కొనసాగింది. మండలంలోని దండేపల్లి, కోతులనడుమ, వల్భాపూర్, సూరారం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇల్లు, గ్రామాల అభివృద్ధికి మద్యం, బెల్టుషాపులు అపశకునాలుగా అడ్డుపడుతుంటే వాటికి తోడు డ్రగ్స్ మహమ్మారి గ్రామాల్లోకి విస్తరిస్తున్నారు. చదువుకునే విద్యార్థులతో పాటు యువత వరకు విస్తరించి తల్లిదండ్రులకు ఇటు సమాజానికి విధ్వంసకర శక్తులుగా తయారుచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, సాతూరి చంద్రమౌళి, వేముల జగదీష్, చుంచు అయిలయ్య, సీసీ రవీందర్, వీఓఏలు, సీఏలు, మహిళలు, మండల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పంటలో యూరియా వాడకం తగ్గించాలి

- శాస్త్రవేత్త జి.వీరన్న



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త వీరన్న

వేలేరు : పంట సాగులో యూరియా వాడకం తగ్గించాలని శాస్త్రవేత్త జి.వీరన్న అన్నారు. శనివారం మండలంలోని గుండ్లసాగర్‌లో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పంటల్లో రసాయన ఎరువులను అవసరం మేరకే వాడాలని, పంట మార్పిడితో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. అలాగే రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొన్నప్పుడు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్రవణ్ కుమార్, ఏఓ కవిత, ఏఈఓ శిల్పా, అభ్యుదయ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

యువ క్రీడాకారులకు స్ఫూర్తి



రాముకు జ్ఞాపిక అందించి సన్మానిస్తున్న జూడో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: చిన్న వయస్సులోనే జూడో అసోసియేషన్ రాష్ట్ర టెక్నికల్ చైర్మన్‌గా ఎంపికైన రాము.. యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరబోయిన కైలాస్‌యాదవ్ అన్నారు. ఈమేరకు వరంగల్‌లోని దేశాయిపేటకు చెందిన చందనగిరి రామును జూడో సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా కైలాస్‌యాదవ్ మాట్లాడుతూ సాధించాలన్న తపన, పట్టుదల, క్రమశిక్షణ ప్రతీ క్రీడాకారుడు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ జూడో అసోసియేషన్ సెక్రటరీ ఎంఏ.అజీజ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ రాంలక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ దూపాకి సంతోష్, కోశాధికారి రవీందర్, సిద్దిపేట జూడో సంఘం కార్యదర్శి భరత్‌రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్‌లు పాల్గొన్నారు.

మోదీ విజయాలను ఇంటింటికీ వివరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ విజయచందర్‌రెడ్డి

ఆత్మకూరు : మోదీ 11 ఏళ్ల పరిపాలన విజయాలను బీజేపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, పెసరు విజయచందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు, దామెర మండల కేంద్రాల్లో శనివారం జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ నూతన కమిటీ పార్టీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషిచేయాలన్నారు. బీజేపీ నాయకులు మార్త రాజభద్రయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సముద్రాల రవి, కిసాన్‌మోర్చా నియోజకవర్గ కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గట్టు వేణు, మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు రమ, శంకర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, మహిళామోర్చా అధ్యక్షురాలు శ్రీలత సమావేశంలో దామెర బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, మండల ఇన్‌చార్జ్ సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీ రామ్‌రెడ్డి, రతన్‌కుమార్, ముఖేష్‌గౌడ్, చందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఈఓ ఆనందం

ఐనవోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైన మండలంలోని ఒంటిమామిడిపల్లి, పంథిని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఎంఈఓ పులి ఆనందం శనివారం అభినందనలు తెలిపారు. నవంబర్ 2024లో పరీక్షలు జరుగగా ఇటీవల ఫలితాలు విడుదల కాగా మండలం నుంచి ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించారు. పంథిని పాఠశాల నుంచి ఐలపాక రోహిత్, అంగడి నందీశ్వర్, ఒంటిమామిడిపల్లి పాఠశాల నుంచి పి.రజినీప్రియ, ఆర్ వర్ష, పి శ్రీచరణ్, ఎం.గౌతమ్, పి.సాత్విక్‌లు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. వీరిని మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ శాలువా, మెమొంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో మంచి ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12వేల చొప్పున రానున్న నాలుగేళ్లు పొందుతారని తెలిపారు.

పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేత

- జీపీ భవనం నిర్మాణం కోసం చెట్లు ధ్వంసం
- అడ్డుకున్న గ్రామస్తులు



పల్లె ప్రకృతి వనంలో నరికేసిన చెట్లు



జీపీ భవనం నిర్మాణం కోసం కొలతలు వేస్తున్న పీఆర్ అధికారులు

శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మించడానికి గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో కొందరు వ్యక్తులు చెట్లను నరికివేశారు. ఈ ఘటన శనివారం గ్రామంలో చోటుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా లక్షల రూపాయలు వెచ్చించి గ్రామంలో ప్రభుత్వ భూమి ఉండగా భూమిని పల్లె ప్రకృతి వనానికి కేటాయించి మొక్కలు నాటారు. కొంత మంది వ్యక్తులు కక్ష సాధింపు కోసం పల్లె ప్రకృతి వనంలో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించడానికి 10 చెట్లను నరికివేశారని తెలిపారు. జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ చేయడానికి ఎమ్మెల్యే నేడు రానునందున పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరుకుతుండడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిలో గత ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం పల్లెప్రకృతి వనానికి కేటాయించిన దాని ప్రక్కనే మరికొంత ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆ భూమిలో గత పాలకవర్గం జీపీ భవనాన్ని నిర్మించాలని అనుకున్నారని గ్రామస్తులు తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ సిబ్బందితో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి సర్వే చేసి 5 గుంటల భూమిని సూచించినట్లు తెలిపారు. గ్రామంలోని కొందరు వ్యక్తులు అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రకృతి వనంలోని చెట్లను నరికివేశారని తెలిపారు.

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు : తహసీల్దార్

గంగిరేణిగూడెంలోని పల్లె ప్రకృతి వనంలో జీపీ భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తహసీల్దార్ కల్వల సత్యనారాయణ చెప్పారు. పల్లె ప్రకృతి వనం ప్రక్కనే ఉన్న ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి సర్వే చేసి 5 గుంటల స్థలాన్ని గ్రామ పంచాయతీ భవనానికి సూచించి కేటాయించామని రిపోర్టును ఆర్డీఓకు పంపించామని తెలిపారు.

ప్రకృతివనాన్ని ముట్టుకోవడానికి లేదు : ఎంపీడీఓ

జీపీ భవనానికి గత ప్రభుత్వం పల్లె ప్రకృతివనానికి కేటాయించిన స్థలాన్ని ముట్టుకోవడానికి వీలులేదని ఎంపీడీఓ ఫణిచంద్ర అన్నారు. పల్లె ప్రకృతి వనం స్థలం ఆన్‌లైన్‌లో నమోదై ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటైందన్నారు. తహసీల్దార్ చూపించిన స్థలంలో మాత్రమే గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించుకోవాలని పేర్కొన్నారు.

'వాకిటి'కి మంత్రి పదవి ఇవ్వాలి

హన్మకొండ: త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్ బిడ్డ వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ముదిరాజ్ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, సభ్యులు డిమాండ్ చేశారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన రాష్ట్రంలో ఉన్న ఏకైక ముదిరాజ్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రిగా అవకాశం కల్పించి ముదిరాజ్ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పులి ప్రభాకర్ ముదిరాజ్, పొన్నం రాజు ముదిరాజ్, దండు చిరంజీవి ముదిరాజ్, నీరటి రాజు ముదిరాజ్, సింగారపు రామకృష్ణ ముదిరాజ్, గోనెల విజేందర్ ముదిరాజ్, పులి మహేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



శాయంపేట : ఈద్గా మైదానంలో ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

ఎల్కతుర్తి: బక్రీద్ వేడుకలను భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల ముస్లింలు శనివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు అలాయ్ బలాయ్ చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పరకాల : పరకాలలో బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పరకాల బస్టాండ్ సమీపంలోని మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టిన అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలోని ఈద్గా మైదానంలో శనివారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మతగురువు అబ్దుల్లా మౌళి సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు అలైబలై చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం సోదరులు రాజ్‌మహ్మద్, అంకుశావలి, రఫీ, సర్వర్, సాధిక్, కమురుద్దీన్, జమాలుద్దీన్, జానీషైదా, పాషా తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ముస్లింలు శనివారం బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఐనవోలు: త్యాగానికి ప్రతీకగా ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని ముస్లిం మత పెద్దలు మహ్మద్ యాకుబ్ పాషా, ఇబ్రహీం, ఇస్మాయిల్ తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా బక్రీద్ పండుగను జరుపుకున్నారు. వెంకటాపూర్‌లో అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం జమాత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖలీఫా హజ్రత్ మీర్జామసూర్ అహ్మద్ మాట్లాడుతూ అందరితో ప్రేమగా ఉండండి, ఎవరిని ద్వేషించకు అనే నినాదాన్ని చెప్పారు. కార్యక్రమంలో మైబెల్లి, అక్బర్, గుంషావలి, అజారుద్దీన్, అన్వర్, రఫీ, అజీమెద్దీన్, పాషా, ఇమ్రాన్, రఫీ, అంకుస్, ఉస్మాన్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలలో శనివారం బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి.ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు.శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఆత్మకూరు : హౌజుబుజుర్గులో..



పరకాలలో..



ఐనవోలులో..

నేడు బీవీపీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

విద్యారణ్యపురి: భారత వికాస్ పరిషత్ (బీవీపీ) తెలంగాణ ప్రాంత రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను ఈనెల 8న హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు బీవీపీ ఓరుగల్లు శాఖ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వర్క్‌షాప్ కొనసాగనుందని పేర్కొన్నారు. బీవీపీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ కుమార్ అధ్యక్షతన జరగనున్న వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా బీవీపీ దక్షిణ ప్రాంతీయ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం శాస్త్రి, విశిష్ట అతిథిగా ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ కార్యవాహ మల్లికార్జున్, ఆత్మీయ అతిథిగా బీవీపీ దక్షిణ ప్రాంతీయ సంయుక్త కార్యదర్శి నాగరాజు, బీవీపీ ప్రాంత అధ్యక్షుడు నాగేశ్వర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, కోశాధికారి మాధవి పాల్గొంటారని సత్యనారాయణ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో గతేడాదిలో బీవీపీ నిర్వహించిన వివిధ కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోనున్నట్లు పేర్కొన్నారు.